క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని గాజులపేట్, బంగల్‌పేట్, నటరాజ్‌నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. గాజులపేట, డాక్టర్స్‌లేన్, కొమ్ము నారాయణ రైస్‌మిల్లు, బైల్‌బజార్, అగ్రికల్చర్ మార్కెట్ ఏరియా, మోచిగల్లీ, బుధవారపేట్, గాంధీచౌక్, కబుతర్ కమాన్, నాయుడువాడ, బోయివాడ, రామ్‌రావుబాగ్, భాగ్యనగర్, నటరాజ్‌నగర్, చైన్‌గేట్, ఇంద్రానగర్, గొల్లపేట, శాస్త్రీనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విషు మహా పడిపూజ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో నిర్మల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా విషు మహా పడిపూజ నిర్వహించారు. కేరళలోని శబరిమల శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఏటా నిర్వహించే విషుపూజను పురస్కరించుకొని భక్తులకు అందుబాటులో ఈ పూజ పట్టణంలో నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి ఏడు గంటల నుంచి 11:30 గంటల వరకు బ్రహ్మశ్రీ బుక్క కిట్టు హైదరాబాద్ గురుస్వామి వారిచే సుప్రభాత సేవ, స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అయ్యప్ప మహాపడి పూజలు చేశారు. కొట ప్రభాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీకాంత్ భజన బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనపర్తి విగ్నేష్, కోశాధికారి ముక్క రాజు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

గుట్టపై కొనసాగుతున్న ఉత్సవాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కుర్రన్నపేట్‌లో చారిత్రక వేంకటేశ్వరగుట్టపై స్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ధ్వజారోహణం, దేవతామూర్తుల ఊరేగింపు, దేవతల ఆహ్వాన పూజలు, హోమం నిర్వహించారు. సోమవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం కొనసాగుతోంది. ఆదివారం విష్ణుసహస్రనామ పారాయణం, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, గణపతిపూజ, రక్షాబంధనం, అంకురార్పణ వంటి కార్యక్రమాలను అర్చకులు వంశీదాచార్యుల బృందం నిర్వహించారు.

శ్రీగజ్జలమ్మ ఆలయంలో పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీగజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకులు నగేశ్ ఆధ్వర్యంలో శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అష్టోత్తర పూజాది కార్యక్రమాలు, పల్లకిసేవ నిర్వహించారు. మహారాష్ట్ర భక్తులు ఆలయానికి వచ్చి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

'కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ జునీత్ మేమాన్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసానికి ఖానాపూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల కార్యకర్తలు వచ్చి కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శనిగారపు కమలాకర్, నిరాటి ప్రవీణ్‌కుమార్, సుర్జాపూర్ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, షేక్‌నజీర్, రెహమాన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పలువురి రాజీనామా

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ మండలంలో బీఆర్‌ఎస్‌కు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు రాజీనామా చేశారు. ఇప్పటికే ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ వార్డుసభ్యులు, గ్రామ అధ్యక్షులు ఇలా సుమారు 70 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సంతకాలతో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డికి అందజేశారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరుతామన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక ఖరారు కానప్పటికీ అతని అనుచరులు ఒక్కొక్కరుగా కారు దిగి కాంగ్రెస్‌లో చేరుతున్నారు.



భైంసా: ఇలేగాంలో నివాళులర్పిస్తున్న వీడీసీ సభ్యులు



ఖానాపూర్: సుర్జాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



భైంసాలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావుపటేల్, విఠల్‌రెడ్డి

అంబేద్కర్‌కు ఘన నివాళి

జిల్లావ్యాప్తంగా ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. మహనీయుడి విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిర్మల్‌లో అంబేద్కర్ యువజన సంఘం, పీఆర్టీయూ, టీయూటీఎఫ్, జిల్లా తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో, విద్యుత్‌శాఖ కార్యాలయంలో, టీఎన్జీవో, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భైంసాలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రామారావుపటేల్, నాయకులు విఠల్‌రెడ్డి, నారాయణ్‌రావ్ పటేల్, దళిత సంఘాల నేతలు నివాళులర్పించారు. ఖానాపూర్ మండలం సుర్జాపూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



సోన్: న్యూవెల్మల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు, అధికారులు, నాయకులు



కడెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద..



పెంబిలో నివాళులర్పిస్తున్న నాయకులు



నిర్మల్‌లో తెరవే ఆధ్వర్యంలో..



మామడ: పొన్కల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద..



లోకేశ్వరం: ధర్మోరలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



భైంసారూరల్: పేండ్‌పెల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



తానూరులో అంబేద్కర్, బుద్ధుడి విగ్రహావిష్కరణలో పూజ్యభంతే ధమ్మరత్న, విఠల్‌రెడ్డి



ముధోల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



సర్నాపూర్(జి)లో: నివాళులర్పిస్తున్న నేతలు



దస్తురాబాద్ కేజీబీవీలో..



నిర్మల్‌లోని టీయూటీఎఫ్ కార్యాలయంలో..



నిర్మల్‌లోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో..



కుభీర్‌లోని బుద్ధవిహార్ వద్ద..



సారంగాపూర్‌లో పూలమాల వేస్తున్న నేతలు



కుంటాలలో..

అడెల్లిలో డీసీసీ అధ్యక్షుడి పూజలు

సారంగాపూర్: మండలంలోని అడెల్లిలో మహాపోచమ్మ అమ్మవారిని ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆలయానికి వచ్చిన వారికి కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

గుర్రపుగుండు ఆలయ కమిటీ ఎన్నిక

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని గుర్రపుగుండు వీరాంజనేయస్వామి ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బాజగొని రంజిత్‌గౌడ్, కోశాధికారిగా బొమ్మిడి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా గుండ సతీశ్, ఉపాధ్యక్షుడిగా సిద్విలాస్, కార్యదర్శిగా కొలిపాక రవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల లచ్చన్న, మల్లేశ్, రాజేందర్ రెడ్డి, రాజు, గాడ్పు మనోజ్, కమ్మల స్వామి, రాజేశ్వర్, రాజన్న, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ ఎన్నిక

భైంసా: భైంసా మండలం ఇలేగాంలో ఆది వారం వీడీసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కోల రత్నాకర్, వైస్ చైర్మన్‌గా పెర్తన్‌పల్లి శంకర్, క్యాషియర్‌గా కాటిక్‌వార్ కృష్ణమూర్తి, కోశాధికారిగా కదం దేవి దాస్‌పటేల్, కార్యనిర్వాహణాధికారిగా కోతినోళ్ల గణపతి, సభ్యులుగా కోల గంగాధర్, కదం సంతోశ్‌పటేల్, చౌల ఈరన్న, సురుకుట్ల ధర్మపురి, ధర్నల్‌వార్ నితిన్, జందరి రమేశ్, అల్లకొండ భోజన్న, పాల్కం గంగాధర్, కాత్రే మారుతి, కాంగ్లే లక్ష్మణ్, దీమరి చంద్రశేఖర్, దీమరి గణపతి, అవర్గ బాబు, అరుగుల భూమన్న, కత్తుల వార్ దత్తాత్రి, బట్టు గణేశ్, నీలం నరేశ్, బొజ్జ రాజానందం, పూజేకర్ నాందేవ్, గాడేకర్ కొండిబా, అబ్దుల్ ఖాదర్, షేక్ హైమద్, కాంబ్లే సురేశ్ బాబు, వాగ్మారే అమృత్‌లను ఎన్నుకున్నారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్ మున్నూరు కాపు సంఘ భవనంలో ఆదివారం మున్నూరుకాపు సంఘం పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం పట్టణ గౌరవాధ్యక్షులుగా బాజన్నోల్ల గంగాధర్, అధ్యక్షుడిగా మల్లేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల గోపాల్, కోశాధికారిగా దత్తు, సలహాదారులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

ఖానాపూర్: పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్ ఉపాధి కోసం బెహరాన్ దేశం వెళ్లగా.. అక్కడ ఈ నెల8న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబీకులకు మృతదేహం తీసుకొచ్చే స్థోమత లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఆదివారం మృతుడి భార్య లావణ్యకు పట్టణంలోని ఐదోవార్డు కౌన్సిలర్ పరిమి లతసురేశ్ తమ వంతుగా రూ.5వేలను ఆర్థికసాయంగా అందించారు. కార్యక్రమంలో షబ్బీర్‌పాషా, సలీంఖాన్, గణేశ్ తదితరులు ఉన్నారు.

మంజులాపూర్‌లో సౌకర్యాలేవి?

- కాలనీలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- కానరాని సీసీ రోడ్లు, డ్రెయినేజీలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న 18, 19వ వార్డుల ప్రజలు



డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం



ఖాళీస్థలంలో ప్లాస్టిక్ వ్యర్థాలు

నిర్మల్‌టౌన్: మున్సిపాలిటీలో 18, 19 వార్డులు కలిసి ఉన్న మంజులాపూర్ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడంతోపాటు పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అంతర్గత రోడ్లు సరిగా లేవు. పన్నులు చెల్లిస్తున్నా.. కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మంజులాపూర్ కాలనీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

కంపు కొడుతున్న డ్రెయినేజీలు..
2019లో ఈ రెండు(18,19) వార్డులను మున్సిపాలిటీలో కలిపారు. ఈ రెండు వార్డులను మంజులాపూర్ కాలనీగా పిలుస్తారు. 18వ వార్డులో 2,160 ఓటర్లు, 19వ వార్డులో 2,050 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం ఈ కాలనీలో డ్రెయినేజీలు పూడిక, చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో వెదజల్లే దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలకోసారి మున్సిపల్ సిబ్బంది, డ్రెయినేజీలను శుభ్రం చేయించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. దీంతో తరచుగా డ్రెయినేజీల్లో నీరు ముందుకు పారకుండా రోడ్లపైకి వస్తుంది.

కానరాని శ్మశానవాటిక..
ఈ కాలనీలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటిక లేదు. కాలనీ శివారులో ఉన్న ఖాళీ స్థలంలో దహనసంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఇబ్బంది పడుతున్నామని శ్మశానవాటిక నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్ల వద్ద ప్రమాదాలు..
భైంసా నుంచి నిర్మల్ వచ్చేటప్పుడు ప్రారంభంలో ఈ కాలనీయే ఉంటుంది. ఈ రోడ్డు హైవే నెంబర్ 222 కావడంతో పెద్దసంఖ్యలోవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు మధ్యలో డివైడర్లు ఎత్తుగా నిర్మించక రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వందల సంఖ్యలో గేదెలు, ఆవులు మృతి చెందాయని స్థానికులు పేర్కొంటున్నారు. గతేడాది హోంగార్డు ప్రమాదంలో మృతిచెందగా పదుల సంఖ్యలో గాయపడ్డారు.

శుభ్రం చేయించాలి



కాలనీ పరిధిలో ఉన్న 18, 19 వార్డుల్లో డ్రెయినేజీల్లో పూడికను తొలగించడం లేదు. దీంతో రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి మూడు నెలలకోసారి డ్రెయినేజీలను శుభ్రం చేయించాలి. రోడ్లు కూడా సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.
– మగ్గిడి రమేశ్, 18వ వార్డు

శ్మశానవాటిక నిర్మించండి



మంజులాపూర్ కాలనీలో శ్మశానవాటిక లేక అంత్యక్రియల సమయంలో అవస్థలు పడుతున్నాం. శ్మశానవాటిక నిర్మించాలి. జాతీయ రహదారి కావడంతో డివైడర్ మధ్య నుంచి రోడ్డు దాటేప్పుడు ప్ర మాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరగకుండా జాలీలు ఏర్పాటు చేయాలి. రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రతి వీధిలో సీసీ రోడ్లు వేయాలి.
– కర్రోళ్ల శంకర్ యాదవ్, 19వవార్డు

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

కడెం: సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించాలని మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామ రైతులు కోరారు. సరస్వతి, సదర్మాట్ కాలువలకు ఇటీవలే నీటిని విడుదల చేయడంతో ఆదివారం లక్ష్మణచాంద మండలం వడ్యాల్ వద్ద కొత్తమద్దిపడగ రైతులు కాల్వ నీటిని పరిశీలించారు. నెల రోజుల వరకు నీటిని అందిస్తే పంటలు చేతికొస్తాయని పేర్కొన్నారు. నీటి విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు దుల్లె వెంకటేశ్ నేత, కృష్ణయ్య, నారాయణ, గంగన్న, శంకర్, రాజేందర్, రాజయ్య తదితరులున్నారు.

మహిళా చట్టాలను వినియోగించుకోవాలి

సారంగాపూర్: మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు తెలుసుకొని మహిళలు, విద్యార్థినులు వినియోగించుకుని న్యాయ సహాయం పొందాలని నిర్మల్ జిల్లా అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి భవిష్య అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని జామ్ గ్రామంలో ఉన్న కేజీబీవీలో నిర్మల్ మండల న్యాయసేవా కేంద్రం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలు, అరాచకాలను అరికట్టడానికి గృహహింస, మహిళల రక్షణ చట్టం, పోక్సో వంటి చట్టాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది రాజలింగం, పాఠశాల ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి భవిష్య

శ్రీరామనవమి ఉత్సవాలు



కామోల్‌లో కొనసాగుతున్న సప్తాహం



దేగాంలో తలంబ్రాలు కలుపుతున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని కామోల్, దేగాం గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం కామోల్‌లో సప్తాహం నిర్వహించగా దేగాంలో స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. శ్రీరామనవమి వరకు ఆలయాల్లో అన్నదానం కొనసాగుతుంది.

కుంటాల:మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 17 వరకు నిర్వహించే ఉత్సవాలలో రోజు బాబాకు మంగళస్నానం, అలంకరణ, గణపతి, గౌరీపూజ, సాయినామ సప్తాహ సంకీర్తన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అర్చకులు ప్రకాశ్‌జోషి, రమేశ్‌సాయి కృష్ణ తదితరులు ఉన్నారు.

కుట్టుశిక్షణ ప్రారంభం

ఖానాపూర్: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్వచింతల్‌లో ఆదివారం కుట్టుశిక్షణను ప్రారంభించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ ఆర్తి చవాన్ కోరారు. బ్లాక్ మేనేజర్ గణేశ్ ఉన్నారు.